పేరు శ్రీనాథుడు! కానీ తాను శివ భక్తుడు! ఈశ్వరార్చన కళాశీలుడు! అంతేనా! తన గంటం దిద్దిన ప్రత్యక్షరం శివవిలాసం! కాశీఖండం! భీమేశ్వర విలాసం! శివరాత్రి మాహాత్మ్యం! తాను వైష్ణవ కథా వీధిలో కాలూన లేదు... బహుశా యిదేనేమో సృష్టి వైచిత్ర్యం!"

మెల్లిమెల్లిగా మెట్లెక్కాడు..

ముందుగా శ్రీశైల మల్లికార్జునుడిని దర్శనం చేసుకుని ఆ చెవిటి మల్లన్నకు శిరసు తాకించి "స్వామి! భారద్వాజ గోత్రుడి ఆపస్తంభ సూత్రుడ్ని శ్రీనాథుడ్ని నీ సన్నిధికి వచ్చాను! మల్లన్నా నాకు శివసాయుజ్యం ప్రసాదించు" అని ప్రార్థించాడు. పూజా ప్రసాదం యిచ్చిన విభూతి ముఖాన, రొమ్మున, చేతుల మీదా తవివారా దిద్దుకుని మహాప్రసాదం అనుకున్నాడు. ఆపై అమ్మ భ్రమరాంబను దర్శించి నమస్కరించి ప్రసాదం యిచ్చిన పీఠపూజా కుంకుమ నుదుట దిద్దుకున్నాడు. అమ్మను ఏమీ అడగలేదు.

ఆపై ఆలయంలో ఓ మండపంలో ఏకాంతంగా కూర్చుని పంచాక్షరీ జపం ప్రారంభించాడు.

* * *

ఏదో నగరం! అందులో ఏదో వీధి! అక్కడ ఎవరో తెలియని అధికారి! వారేదో తెలియని భాష మాట్లాడుతున్నారు. దూరదూరంగా పరప్రభుత్వాధికారానికి జడిసి నిలుచున్నారు గ్రామీణులు.

అందరి మధ్యా ఎవరో ఓ సహస్రమాస జీవి!

ఆయన భుజం మీద ఓ నల్లగుండు! కాళ్లకు అడ్డుపడుతూ నిగళ యుగం! ఆయన ముఖం మీద అవధూత లక్షణమైన చిదానంద హాసం! మెడలో బొగడ దండ! చేతులకు వెదురు గొడియ! చేతిలో వెదురు కర్ర ఊత.. మండుటెండల వల్ల ధారాపాతంగా కారుతోన్న చెమటలు... వాటిని మించేలాగా చుట్టూరా జనం కారుస్తోన్న కన్నీళ్ళు....

'హరహర మహాదేవ!' అంటూ ఒక్కసారి దిక్కులు పిక్కటిల్లేట్టు భక్త జనం తలుచుకున్నారు.

ఉలికి పడ్డట్టై కళ్లు తెరిచాడు శ్రీనాథుడు.

దగ్గర్లో ఉన్న దగ్గుపల్లి దుగ్గన్న ఆయన ప్రియ శిష్యుడు, బావమరిది చేతులు జోడించి అన్నాడు.- "తమరు జపంలో మునిగి యోగ సమాధి చేరుకున్నారు. లింగోద్భవ కాలం సమీపిస్తోంది. స్వామిని దర్శించి, అభిషేకించాలి తమరు. కానీ తమరిని జాగృతం చేయడానికి మార్గం కనిపించలేదు. ఈలోగా యీ పరస జనం- ఈ కన్నడ జనం ఒక్కసారిగా హరహర మహాదేవ స్మరణ చేశారు. తమరికి ధ్యాన భంగమైంది" అన్నాడు...

శ్రీనాథుడు ఏమీ అనలేదు. ఆవులింత వచ్చింది ఆయనకి. లేచి పదప్రక్షాళన చేసుకుని చల్లని నీటితో కళ్లు తుడుచుకుని ఆలయం వైపు నడిచాడు.

'బావగారు నిద్రపోయారా!' అనుకున్నాడు దుగ్గన్న "స్వభార్యా సౌఖ్యం, పుస్తకం, జపం నిద్రకలిగిస్తాయనడం నిజమేనన్నమాట" అనుకున్నాడు మళ్లీ.

శ్రీనాథుడు లింగోద్భవ కాలానికి ముందే గర్భాలయం ప్రవేశించి అర్చకులతో పాటు గొంతు కలిపి 'నమశ్శివాయచ...' అని పఠిస్తూ, బ్రాహ్మ ముహూర్తం దాకా అక్కడే గడిపాడు.

* * *

మాఘ బహుళ అమావాస్య మసక చీకట్లు ముసురుకోబోయే ముందు శ్రీశైల శిఖరాన్ని చూస్తోన్న కవి సార్వభౌముడికి తనకు గతదినం వచ్చిన కల గుర్తొచ్చింది.

'కలలు భవిష్యత్ సూచకాలు కదా' అనుకున్నాడాయన. "ఈ దేహికి యింకేదో శేషం మిగిలింది. ఆ భోగం కూడా పూర్తయిపోతే మహా ప్రస్థానానికి యింకేమీ అడ్డుండదు.

నడిచి నడిచి ఆ పరమ శివుడి సన్నిధి చేరుకోవచ్చు! నిత్యం హరహర మహాదేవ అనుకోవచ్చు!"

ఆ భావన రాగానే, ఆయన పెదాలమీద సినీ వాలి లాంటి చిరునవ్వు వెలిగింది.

అప్రయత్నంగా ఆయన నోటి వెంట "హరహర మహాదేవ"......

## కథలు వ్రాయడం ఎలా?



* పనసకాయ దొరికి నప్పుడే... అనే పంథాలోనే, కొబ్బరి మీగడలాంటి కాగితం సుతారంగా నడిచే కలం కనబడటం తరువాయి శ్రీకాం చుట్టవలసిందే! ఆలోచనల కోసం వాటి జన్మ స్థానములైన శిరస్సునూ, కపోలములనూ, ఎడనెడ చిబుకమునూ తడుముకోవడం, అవి పైకి రావడం కోసం ఒళ్లు విరుచుకోవడం, - వగైరాలతో మనకు నిమిత్తం లేదు. చెక్కిళ్ల ప్రాంతాలలో ఊహలు మొలకెత్తుతవి, అనేది యీనాటికే అనుభవంలోకి రాలేదు. "స్వకపోల కల్పితము" అని ధీమాగా చెప్పుకునే హక్కు, అర్హత మనకు సంక్రమిస్తుందని తోచదు. అయితే - విష్ణోర్జిహ్వా సరస్వతీ - అన్న ఫక్కీలో - కవికుల వదనాంబురుహ బద్దనివేశా - లని అనుకోవడం సంప్రదాయం కదా అంటారా! కవనం జెప్పే వాళ్లనోళ్ల, కథలు వ్రాసేవారి మునివేళ - ఆ యిల్లాలు కాపురం ఉంటుందని నమ్మేవారు ఎందుకు ఉండరాదు?.... నీ కథకు నీతి ఏది? దానికి ఉన్నదల్లాజాతి. నీ రచనది ఏ జాతి?.

కడజాతి - సంహిత లగాయతు ఉపనిషత్తు దాకా, అది చాతుర్వర్ణం. కథ అనేది కడజాతి! ఇది అహంకారంరా తండ్రీ అనేరు గనుక; ఇది శుష్క అహంకారం కాదు, అనుభవసారం! అవునండీ, పద్దెనిమిది వర్ణనలూ పెట్టి యిద్దరిని హెచ్చవేసి, ఎనభై నాలుగు అని ఫలితం దేల్చే కవిరాయుడు కాంచనిది, రవి కాంచినచో, - అవ్వాడు కాంచనేరనిది, నోచనిది కథకుడు కాంచునే కదా!

- మల్లాది రామకృష్ణ శాస్త్రి.

శార్వరి సంకలనం నుంచి